బడికి రైట్ రైట్

- విద్యార్థుల కోసం ఆర్టీసీ 'స్టూడెంట్ స్పెషల్'
- ఉచిత, రాయితీ బస్ పాస్‌లు
- ప్రభుత్వ చర్యలతో ఆనందం

అమలాపురం రూరల్: చదువరులకు శుభవార్త.. దూర ప్రాంతాలకు వెళ్లి విద్యాభ్యాసం సాగించే విద్యార్థులకు ఇదో చక్కని అవకాశం. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే విద్యార్థులకు ప్రభుత్వం రాయితీ, ఉచిత పాస్‌లను జారీ చేస్తోంది.. గ్రామీణ ప్రాంతాల నుంచి చాలా మంది విద్యార్థులు పట్టణ ప్రాంతాల్లో విద్యా సంస్థలకు వెళ్తుంటారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే విద్యార్థులకు ప్రజారవాణా శాఖ ఉచిత, రాయితీ బస్సు పాస్‌లు మంజూరు చేస్తోంది. వీరి కోసం ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక బస్సులు కూడా నడుపుతోంది. గత సోమవారం నుంచి రెండు పూటలా పాఠశాలలు పనిచేస్తున్నాయి. దీంతో అమలాపురం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బస్ పాస్‌ల జారీ కౌంటర్లు ప్రారంభించారు. దూర ప్రాంతాల్లోని పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేందుకు పాస్‌లను జారీ చేస్తున్నారు. బస్ రూటు ఆధారంగా రాయితీ చార్జీని నిర్ణయిస్తారు.

వీరికి ఉచితం..

అక్షరాస్యతా శాతాన్ని పెంచేందుకు 12 ఏళ్ల లోపు విద్యార్థులు, 18 ఏళ్ల లోపు విద్యార్థినులకు ఉచితంగా బస్ పాస్‌లను ఆర్టీసీ జారీ చేస్తుంది. ఈ పాస్‌లు ఏడాది వరకూ చెల్లుబాటు అవుతాయి. మిగతా వారికి రాయితీతో బస్ పాస్‌లు మంజూరు చేస్తారు. పాస్ ధరతో పాటు సంవత్సరం గుర్తింపు కార్డు కోసం రూ.100, నెలవారీ గుర్తింపు కార్డు రూ.50, సర్వీసు చార్జీ రూ.40 అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. రాయితీ బస్ పాస్‌లు నెల, మూడు నెలలు, ఏడాది కాల పరిమితితో మంజూరు చేస్తారు. గడువు ముగిశాక రెన్యువల్ కోసం పాఠశాల హెచ్ఎం, కళాశాల ప్రిన్సిపాల్ సంతకం చేయించుకుని తిరిగి పొందాల్సి ఉంటుంది. సాధారణ విద్యార్థులకు జూన్ నుంచి ఏప్రిల్ వరకూ, ఐటీఐ, పారా మెడికల్ వంటి కోర్సులు చదివే వారికి మే నెలలో కూడా పాస్‌లు ఇస్తారు. ప్రతి ఐదు కిలోమీటర్లకు ఒక స్టేజ్‌గా పరిగణనలోకి తీసుకుని దూరాన్ని బట్టి రాయితీ ఇస్తారు. అమలాపురం, ఉప్పలగుప్తం, అల్లవరం, ముమ్మిడివరం, కాట్రేనికోన, ఐ.పోలవరం, అంబాజీపేట, అయినవిల్లి మండలాలకు చెందిన విద్యార్థులు అమలాపురం బస్ డిపో నుంచి బస్ పాస్‌లను పొందుతున్నారు. ఈ డిపో నుంచి



ఆర్టీసీ స్టూడెంట్ స్పెషల్ బస్సు

గతేడాది 6 వేల మంది విద్యార్థులకు ఫ్రీ బస్ పాస్‌లు, 3,500 మందికి రాయితీ పాస్‌లు, 3 వేల మంది దివ్యాంగులకు బస్ పాస్‌లు జారీ చేశారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తులు

ఏపీఎస్ ఆర్టీసీ ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకుని దరఖాస్తు చేసుకోవాలి. కళాశాల విద్యార్థులు 10వ తరగతి మార్కుల జాబితా,



అమలాపురం డిపో కౌంటర్ వద్ద బస్ పాస్‌లు తీసుకుంటున్న విద్యార్థులు

ఆధార్ కార్డు జెరాక్స్ కాపీ జత చేయాలి. స్టడీ సర్టిఫికెట్‌తో పాటు రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, సెల్ నంబర్ ఇవ్వాలి. దరఖాస్తులను సమీప డిపో మేనేజర్ పరిశీలించి పాస్ మంజూరుకు సిఫార్సు చేస్తారు. వీటిని మంజూరు కౌంటర్‌లో ఇచ్చి నిర్ణీత రుసుం చెల్లించి పాస్ పొందవచ్చు.

ప్రత్యేక బస్సు సర్వీసులు



విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నాం. పాఠశాలలు, కళాశాలలు ప్రారంభమైనందున బస్ పాస్‌ల జారీ ప్రారంభించాం. ప్రభుత్వం అందించే బస్సు పాస్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. 50 కిలోమీటర్ల పరిధి వరకూ బస్ పాస్‌లు జారీ చేస్తున్నాం. సదరం సర్టిఫికెట్ పొందిన దివ్యాంగులకు 50 శాతం రాయితీతో పాస్‌లు ఇస్తున్నాం.

–చల్లా సత్యనారాయణమూర్తి, ఆర్టీసీ డిపో మేనేజర్, అమలాపురం

క్లుప్తంగా

జగనన్న సురక్ష సర్వేపై ఆకస్మిక తనిఖీ



జగనన్న సురక్ష సర్వేపై సచివాలయ సిబ్బందిని ప్రశ్నిస్తున్న ఎంపీడీఓ కృష్ణమోహన్

అల్లవరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గ్రామాల్లో నిర్వహిస్తున్న జగనన్న సురక్ష సర్వేపై ఎంపీడీఓ కృష్ణమోహన్ కోడూరుపాడు పంచాయతీ పరిధిలో ఆదివారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. గ్రామంలో వెయ్యికి పైగా కుటుంబాలు ఉండగా ఇప్పటివరకూ 60 శాతం సర్వే పూర్తయిందని సిబ్బంది తెలిపారు. ఈ నెల 7న జరిగే జగనన్న సురక్ష కార్యక్రమం జరగనున్న నేపథ్యంలో లబ్ధిదారులకు అందించే ధ్రువపత్రాలను పంపిణీకి సిద్ధం చేయాలని ఎంపీడీఓ ఆదేశించారు. కార్యక్రమంలో కార్యదర్శులు ఎస్వీవీ సత్యనారాయణ, చిక్కం శ్రీను, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల పథకాలు పునరుద్ధరించాలి



కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న రాము

అమలాపురం టౌన్: భవన నిర్మాణ కార్మికుల పథకాలను పునరుద్ధరించాలని రాష్ట్ర భవన, ఇతర నిర్మాణ రంగాల కార్మిక ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు గల్లా రాము రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. స్థానిక దుడ్డివారి అగ్రహారంలో వివిధ నిర్మాణ రంగాలకు చెందిన కార్మికులతో ఆదివారం జరిగిన సమావేశానికి రాము ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్మికుల పథకాలు పునరుద్ధరించాలని కోరుతూ త్వరలోనే రాష్ట్ర కార్మిక మంత్రి జయరామ్‌ను కలిసి వినతి పత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు. సమావేశంలో కార్మిక సంఘాల ప్రతినిధులు పేరాబత్తుల శ్రీనివాసరావు, పలివెల రామప్రసాద్, కురసాల గోవిందరాజులు, దంటేటి శ్రీనివాస్, మద్దుల దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శాకంబరిగా సత్తెమ్మ అమ్మవారు



ముమ్మిడివరం: ఆషాఢమాసం ఆదివారం కావడంతో కోనసీమ కల్పవల్లిగా విరాజిల్లుతున్న ముమ్మిడివరం మండలం సీహెచ్ గున్నేపల్లి సత్తెమ్మ అమ్మవారు శాకంబరిదేవిగా దర్శనమిచ్చారు. భక్తులు సమకూర్చిన కాయగూరలతో అమ్మవారిని అలంకరించి పూజలు చేశారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఉచిత పులిహోర, చంటి పిల్లలకు పాలు పంపిణీ చేశారు.

అమ్మవారికి చెరకు పానకంతో అభిషేకం



వారాహి అమ్మవారిని చెరకు పానకంతో అభిషేకిస్తున్న అక్షయ పాత్ర సేవకులు

అమలాపురం టౌన్: స్థానిక విద్యుత్ నగర్‌లోని ఆదిశేష నిలయంలో జరుగుతున్న వారాహి షోడశ రాత్రి పూజా మహోత్సవాల్లో భాగంగా 14వ రోజు ఆదివారం వారాహి అమ్మవారికి 125 కేజీల చెరకు పానకంతో అభిషేకం నిర్వహించారు. అనంతరం నవరసాలతోనూ అభిషేకాలు చేశారు. పూజల్లో అక్షయ పాత్ర ప్రతినిధులు పోతురాజు రామకృష్ణారావు, తూము దొరబాబు, చాగంటి ప్రసాద్, పోతురాజు నాగ కనకదుర్గ, లింగోలు శిరీష తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాలి

యానాం: భారతీయ సంస్కృతీసంప్రదాయాలను, నైతిక విలువలను కాపాడుకుంటూ తదుపరి తరానికి వాటిని అందజేయాలని సంస్కృతి భారతి దక్షిణ ప్రాంత అధ్యక్షుడు దోర్బల ప్రభాకరశర్మ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక గీతామందిరంలో యానాం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో జరిగిన గురు పూజోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జాతీయ జీవనానికి, హిందూ సంస్కృతికి ప్రతీకగా నిలిచిన పరమ పవిత్ర భగవాధ్వజాన్ని ఆర్ఎస్ఎస్ శ్రేష్ఠ గురువుగా స్వీకరించిందన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు రామారావు తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరి కార్మికులకు ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలి



ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌ను సత్కరిస్తున్న కొబ్బరి ఒలుపు కార్మిక సంఘ ప్రతినిధులు

అల్లవరం: కొబ్బరి పరిశ్రమలో దింపు, ఒలుపు కార్మికుల కోసం ప్రత్యేక బోర్డుని ఏర్పాటుచేయాలని ఏపీ రాష్ట్ర కొబ్బరి దింపు, ఒలుపు కార్మిక సంఘ రాష్ట్ర అధ్యక్షుడు బొడ్డపల్లి నాగేశ్వరరావు ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్‌ని కోరారు. గోడిలోని ఆయన నివాసంలో ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. కొబ్బరి కార్మికులు కాళ్లు, చేతులకు సంబంధించి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని, 50 సంవత్సరాలు దాటిన కార్మికులకు ప్రభుత్వం నుంచి పింఛన్ మంజూరు చేయించాలని ఎమ్మెల్సీని వారు కోరారు. దీనిపై సీఎం వైఎస్ జగన్‌తో చర్చించి పరిష్కారానికి ప్రయత్నం చేస్తానని ఇజ్రాయిల్ తెలిపారు. అనంతరం ఎమ్మెల్సీని శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు గుబ్బల శ్రీరామమూర్తి, పీవీఎస్ మూర్తి, మామిడికుదురు, గన్నవరం మండల అధ్యక్షులు గుబ్బల కృష్ణ, లంక నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు నిత్యావసరాల పంపిణీ

అమలాపురం రూరల్: మండలంలోని ఎ.వేమవరంలో జరిగిన అగ్నిప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన ఐదు కుటుంబాలకు బీజేపీ జాతీయ కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యుడు నల్లా పవన్‌కుమార్ 100 కేజీల బియ్యం, బకెట్లు, రూ.3,000 ఆర్థిక సాయం ఆదివారం అందజేశారు. బీజేపీ అమలాపురం నియోజకవర్గ కన్వీనర్ అయ్యల భాషా, జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి జంగా రాజేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అమలాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచే రమణారావు బియ్యం, నిత్యావసర సరకులు, దుస్తులు, వంట సామగ్రి ఇచ్చారు. కార్యక్రమంలో గుడ్ సీడ్ ఫౌండేషన్ సభ్యులు గంటా లక్ష్మీ ప్రసాద్, కుంచే అర్జున్, పరమట రాజేష్, నేరేడుమిల్లి శ్రీనివాసరావు, పోలినాటి భీమేష్ తదితరులు పాల్గొన్నారు.



బాధితులకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న నల్లా పవన్ కుమార్

దేవాంగ సంక్షేమ సంఘ కార్యవర్గ సమావేశం

అమలాపురం రూరల్: మండలంలోని బండారులంకలో కోనసీమ దేవాంగ సంక్షేమ సంఘం కార్యవర్గ సమావేశం ఆదివారం సాయంత్రం జరిగింది. సమావేశానికి సంఘ అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ పూటుకూరి సుబ్రహ్మణ్యస్వామి అధ్యక్షత వహించారు. ఏటా పదో తరగతిలో 500 పైబడి మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహిక బహుమతులు ఇవ్వాలని సమావేశంలో తీర్మానించారు. ఇటీవల మృతి చెందిన సంఘ గౌరవాధ్యక్షుడు బళ్ల వీర నాగ మల్లేశ్వరరావు సంతాప సభ నిర్వహించారు. కార్యక్రమంలో బళ్ల వెంకటేశ్వరరావు, పుత్సల వరదరాజులు, చింతా శంకరమూర్తి, పిచ్చిక శ్యామ్, బట్టు టాక్సీరామ్, నల్లా సత్యానందం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సంఘ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యస్వామి తదితరులు

వామ్మో ఆషాఢం ఎండలు

ఉప్పలగుప్తం: గత కొన్నేళ్లలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది వేసవి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రోహిణి కార్తెలో రోళ్లు పగిలిపోయేంత ఎండలు కాశాయి. అనంతరం మృగశిర కార్తె వచ్చినా ఎండల తీవ్రత తగ్గలేదు. ఇంతలో రెండు మూడు రోజుల పాటు తొలకరి జల్లులు పడే సరికి ప్రజలు వాతావరణం చల్లబడిందని ఉపశమనం పొందారు. అంతలోనే భానుడు మళ్లీ తన ప్రతాపం మొదలుపెట్టి భగభగలు సృష్టిస్తున్నాడు. ఆషాఢం పైగా జులై నెల వచ్చేసినా ఎండలు తగ్గకపోవడంతో ప్రజలు ఇళ్లకే పరిమితమవుతున్నారు. మండలంలోని ఉప్పలగుప్తం, ఎస్.కొత్తపల్లి, గొల్లవిల్లి, భీమనపల్లి, చల్లపల్లి ప్రధాన కూడళ్లలో ఆదివారం ప్రధాన రహదారులన్నీ నిర్మానుష్యంగా కనిపించాయి. ఎండలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఖరీఫ్ సాగు కోసం పొలంలో విత్తనాలు చల్లినా ఉపయోగముండదని రైతులు వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు.



ఎండ తీవ్రతకు నిర్మానుష్యంగా మారిన ఉప్పలగుప్తం ప్రధాన రహదారి

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



చొల్లంగిలో స్థానిక మహిళలకు ప్రభుత్వ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

- ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్
- చొల్లంగిలో గడప గడపకూ మన ప్రభుత్వం

తాళ్లరేవు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. చొల్లంగి పంచాయతీలో మూడో రోజు ఆదివారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గత నాలుగేళ్లలో ప్రభుత్వం ద్వారా ప్రజలకు అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి కరపత్రాలు అందజేశారు. పలుచోట్ల మహిళలు ఎమ్మెల్యే పొన్నాడకు హారతులిచ్చి ఘనంగా స్వాగతం పలికారు. ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకుంటూ, ప్రభుత్వం చేసిన లబ్ధిని వివరిస్తూ ముందుకు సాగారు. ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, గృహ రుణాలు మంజూరు చేయాలని, డ్రైనేజీలు నిర్మించాలని పలువురు ఎమ్మెల్యేకు మొరపెట్టుకున్నారు. ఆయా సమస్యలను తక్షణమే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో అర్హులందరికీ పారదర్శకంగా ఇంటి ముంగిటకే ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ రాయుడు సునీత, వైఎస్ ఎంపీపీ ధూళిపూడి నాగేంద్రప్రసాద్, పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాదా గోవిందకుమార్, రాయుడు గంగాధర్, బూరెల వెంకట్రాజు, కాపవరపు శ్రీదేవి, శివాజీ గణేష్, వారా సూర్యకుమారి, మాసా శ్రీను, స్వర్ణ రాజు, వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగురాలికి ట్రైసైకిల్ అందజేత

అల్లవరం: ఏపీ విభిన్న ప్రతిభావంతుల మరియు వయోవృద్ధుల సహాయ సంస్థ ద్వారా పంపిణీ చేసిన ట్రైసైకిల్‌ని అంబాజీపేట మండలం గంగలకుర్రు గ్రామానికి చెందిన తరివెట్ల దుర్గభవానికి ఎంపీ చింతా అనురాధ అందజేశారు. మొగళ్ళమూరు ఎంపీ కార్యాలయంలో ఆదివారం జరిగిన పంపిణీ కార్యక్రమంలో ఎంపీ అనురాధ మాట్లాడుతూ లబ్ధిదారులకు 100 శాతం సబ్సిడీతో ఉచితంగా ట్రైసైకిళ్లు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సాపే పార్థసారథి, అడపా శ్రీను, సీతబాబురాజు, పరమేష్, అంబికా శ్రీను తదితరులు పాల్గొన్నారు. ఎంపీ కార్యాలయంలో హంస వాహిని ట్రస్టు సేవా కార్యక్రమాల నిమిత్తం చోడే రామప్రసాద్ సమకూర్చిన రూ.50 వేల బ్యాంకు చెక్కుని ట్రస్టు చైర్మన్ బొక్కా సత్యనారాయణకు ఆదివారం అందజేశారు.



దివ్యాంగురాలికి ట్రైసైకిల్ అందజేస్తున్న ఎంపీ అనురాధ

మౌలిక సౌకర్యాలు కల్పించాలంటూ వినతి

అల్లవరం: దేవగుప్తం పంచాయతీ పరిధిలోని ఎస్సీ, బీసీ నిరుపేదలకు కేటాయించిన ఇందిరమ్మ కాలనీలో మౌలిక సౌకర్యాలు కల్పించాలని కాలనీవాసులు ఎంపీ చింతా అనురాధకి మొరపెట్టుకున్నారు. ఆదివారం మొగళ్ళమూరులోని ఎంపీ నివాసంలో ఇందిరమ్మ కాలనీ మహిళలు ఎంపీ అనురాధని కలిసి వినతి పత్రం అందజేశారు. కాలనీ ఏర్పాటుచేసి పదిహేనేళ్లు అవుతున్నా రోడ్లు, కరెంట్ స్తంభాలు, తాగునీరు ఏర్పాటు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్‌ని కలిసి వినతిపత్రం ఇచ్చినా పరిష్కారం కాలేదని ఎంపీకి వివరించారు. తమ కాలనీలో రోడ్లు, కరెంట్ స్తంభాలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో దంగేటి శ్రీదేవి, కుడుపూడి మణి, కడలి మంగాలక్ష్మి, బొంతు రాంబాబు, పెచ్చెట్టి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ కాలనీవాసులు ఇచ్చిన వినతి పత్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీ అనురాధ

చెత్తకు శాశ్వత పరిష్కారం

- పట్టణంలో రూ.3 కోట్లతో వేస్ట్ ప్రాసెసింగ్ ప్లాంట్
- డంపింగ్ యార్డ్‌లో పనులకు కాంట్రాక్టు సంస్థ ఏర్పాట్లు

అమలాపురం టౌన్: అమలాపురం మున్సిపాలిటీ రూ.3 కోట్లతో వేస్ట్ ప్రాసెసింగ్ ప్లాంట్ నిర్మాణానికి ఏర్పాట్లు చేస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో సంయుక్తంగా ఈ ప్లాంట్‌ను నిర్మిస్తుండగా మున్సిపాలిటీ వాటాగా రూ.84 లక్షలు చెల్లిస్తోంది. దీనికోసం స్థానిక డంపింగ్ యార్డ్‌లో 70 సెంట్ల స్థలాన్ని మున్సిపాలిటీ సిద్ధం చేసింది. ఈ ప్లాంట్ నిర్మాణానికి కాంట్రాక్ట్ పొందిన తరుణీ అసోసియేట్స్ సంస్థ నిర్మాణ పనులు మొదలు పెట్టేందుకు అవసరమైన యంత్ర సామాగ్రిని డంపింగ్ యార్డ్‌కు తరలించింది. ప్లాంట్ ద్వారా పట్టణానికి రోజూ వచ్చే 35 టన్నుల చెత్తను తడి, పొడి, ప్రమాదకర చెత్తలుగా వర్గీకరించి రీ యూజ్ చేయడానికి సాంకేతిక ఏర్పాట్లు చేయనుంది. ప్లాంట్ నిర్మాణం కోసం డంపింగ్ యార్డ్‌లో చెత్త కుప్పలను తొలగించేందుకు మున్సిపాలిటీ ఏర్పాట్లు చేస్తోంది.



వేస్ట్ ప్రాసెసింగ్ ప్లాంట్ నిర్మాణం కోసం సిద్ధం చేసిన యంత్ర సామగ్రి

వివాదం అనివార్యమైనా అభివృద్ధి కోసం

వేస్ట్ ప్రాసెసింగ్ ప్లాంట్ కోసం తొలుత డంపింగ్ యార్డ్‌లో పేరుకుపోయిన చెత్త కుప్పలను తొలగించాల్సి ఉంది. సదరు పనుల నిమిత్తం రూ.10 లక్షల వ్యయమవుతుందని కౌన్సిల్‌లో ప్రతిపాదించినా అది కాస్తా వివాదాస్పదమైన సంగతి తెలిసిందే. గతంలో ఇదే డంపింగ్ యార్డ్‌లో పేరుకుపోయిన చెత్తను తొలగించేందుకు, ఎగవేసేందుకు రూ.5 లక్షల వంతున పలుమార్లు మున్సిపాలిటీ వెచ్చించిన సందర్భాలను కౌన్సిల్ వ్యతిరేకిస్తోంది. అయితే ప్లాంట్ నిర్మాణం పట్టణ అభివృద్ధికి ఎంతో అవసరమని కౌన్సిల్ భావిస్తోంది. అందుకే రూ.10 లక్షలు పారదర్శకంగా వెచ్చించేలా మార్గదర్శకాలు చెబుతూ ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. దీంతో ప్లాంట్ నిర్మాణానికి త్వరలోనే శ్రీకారం చుట్టనున్నారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, పాలక, ప్రతిపక్ష కౌన్సిలర్లు ప్లాంట్ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి డంపింగ్ యార్డ్‌లో చెత్త సమస్యకు శాశ్వతంగా చరమ గీతం పాడేందుకు కృషి చేస్తున్నారు.

పట్టణ ప్రగతి మరింత పెరుగుతుంది

రూ.3 కోట్లతో నిర్మితం కానున్న వేస్ట్ ప్రాసెసింగ్ ప్లాంట్ వల్ల చెత్త సమస్యకు శాశ్వత పరిష్కారం దొరుకుతుంది. అది కచ్చితంగా పట్టణ ప్రగతిని మరింత పెంచుతుంది. ఇప్పటికే కాంట్రాక్ట్ సంస్థ ప్లాంట్ పనులు మొదలు పెట్టే దిశగా యంత్రాలు, పరికరాలను యార్డ్‌లోకి తరలించింది. త్వరలోనే పనులు మొదలవుతాయి.

– ఒమ్మి అయ్యప్పనాయుడు, కమిషనర్, అమలాపురం మున్సిపాలిటీ

కాపు జేఏసీ రాష్ట్ర కన్వీనర్‌గా సుబ్బారావు

అమలాపురం రూరల్: కాపు జేఏసీ రాష్ట్ర కన్వీనర్‌గా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకట సుబ్బారావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా సుబ్బారావును బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యళ్ళ దొరబాబు ఆదివారం రాత్రి దుశ్శాలువాతో సత్కరించారు. సుబ్బారావు కాపు యువత అభివృద్ధి కోసం కృషి చేయాలని పలువురు నాయకులు కోరారు. ఈ సందర్భంగా మోకా వెంకట సుబ్బారావు మాట్లాడుతూ కాపు సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా, జిల్లా అధ్యక్షుడు కర్రి చిట్టిబాబు, సీహెచ్ త్రినాథరావు, కొండేటి ఈశ్వర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

200 మందికి వైద్య పరీక్షలు

తాళ్లరేవు: ఆదివారం స్థానిక సీబీఆర్ చర్చిలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మధుమేహ వైద్య శిబిరం నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్‌సాగర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. శిబిరంలో సుమారు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు చోడే శ్రీనివాస్, కార్యదర్శి రాయపరాజు, కట్టా ఆదినారాయణ, బి.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలకు వందనం



సత్కారం పొందిన వలంటీర్లతో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర

అమలాపురం టౌన్: ఇంటింటా ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని అందిస్తూ వలంటీర్లు చేస్తున్న సేవలకు వందనమని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు, మున్సిపల్ కౌన్సిలర్ మట్టపర్తి నాగేంద్ర అన్నారు. స్థానిక సూర్యనగర్ వార్డు సచివాలయంతో ఆదివారం జరిగిన వలంటీర్ల సత్కార సభకు నాగేంద్ర ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అనంతరం వలంటీర్లు రేవతి, అరుణకుమారి, శ్యామలాదేవి, దుర్గ, నాగరాజు, నాగదేవి, దుర్గాప్రసాద్, కావేరి, మౌలికలను నాగేంద్రలను నగదు బహుమతులతో సత్కరించారు. కార్యక్రమంలో వార్డు సచివాలయ కార్యదర్శులు పి.శ్రీనివాసరావు, బి.సురేష్‌కుమార్, కె.వెంకట గణేష్, కె.ఈశ్వరరావు, జి.పద్మ, ఎస్.కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి విశ్వరూప్ పరామర్శ



మరియమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి విశ్వరూప్

అల్లవరం: ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన గూడాల ఎంపీటీసీ సభ్యురాలు జల్లి మరియమ్మ కుటుంబ సభ్యులను రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ ఆదివారం పరామర్శించారు. మరియమ్మ చిత్రపటం వద్ద మంత్రి నివాళులర్పించారు. ఇదే గ్రామంలో మాతృ వియోగంతో బాధపడుతున్న నూకల చిట్టిబాబుని మంత్రి పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయన వెంట ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ, గృహ సారథుల మండల కన్వీనర్ తిక్కా ప్రసాద్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు పరమట శ్రీను, మట్టపర్తి శ్రీను తదితరులున్నారు.

విజయలక్ష్మి సేవలు ప్రశంసనీయం



ఉద్యోగ విరమణ చేసిన విజయలక్ష్మి దంపతులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

యానాం: యానాం రీజియన్‌లో వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో సైన్స్ ఉపాధ్యాయినిగా పనిచేసిన పెద్దింటి విజయలక్ష్మి అందించిన సేవలు ప్రశంసనీయమైనవని విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్‌ప్రవీణ్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక రాజీవ్‌గాంధీ ప్రభుత్వ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో ఏర్పాటుచేసిన విజయలక్ష్మి ఉద్యోగ విరమణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. అనంతరం పలువురు సహచర టీచర్లు విజయలక్ష్మిని దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఏడీపీసీ కమిడి ప్రభాకరరావు పాల్గొన్నారు.

అధ్వానంగా గోపాల్‌నగర్ రహదారి



రాళ్లు తేలిన గోపాల్‌నగర్ రహదారి

యానాం: స్థానిక 216 జాతీయ రహదారి మూడు తూముల జంక్షన్ నుంచి పట్టణాన్ని కలుపుతున్న గోపాల్‌నగర్ రహదారి అధ్వానంగా ఉందని, దానికి తక్షణం మరమ్మతులు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. గతంలో తారురోడ్డుగా ఉన్న ఈ రహదారిపై చిన్నపాటి గ్రావెల్ మిక్సర్‌ను వేసి వదిలేశారని, దీంతో వాహనాలు వెళుతుంటే దుమ్ము ఎగిసిపడి వాహనచోదకులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. పీడబ్ల్యూడీ అధికారులు స్పందించి గోపాల్‌నగర్ రహదారిని తారురోడ్డుగా అభివృద్ధి చేయాలని కోరారు.

స్టేట్ డైరెక్టర్‌కు ఎంపీపీ అభినందన



శ్రీదేవిని సత్కరిస్తున్న ఎంపీపీ రాయుడు సునీత

తాళ్లరేవు: ఆంధ్రప్రదేశ్ నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ కాపవరపు శ్రీదేవిని ఎంపీపీ రాయుడు సునీత సత్కరించి అభినందించారు. చొల్లంగిలోని ఆమె స్వగృహంలో జరిగిన కార్యక్రమంలో శ్రీదేవిని ఎంపీపీ రాయుడు సునీత దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్ ఎంపీపీ ధూళిపూడి నాగేంద్రప్రసాద్, నాయకులు బూరెల వెంకట్రాజు, రాయుడు గంగాధర్, స్వర్ణ రాజు, వారా సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.